గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ఉప్పలపాడులో 1.20 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, సీసీ రోడ్లు, కల్వర్టులకు ప్రారంభోత్సవం
- ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం గ్రామాలకు తాగునీరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య


హాజరైన గ్రామ ప్రజలు

పెదకాకాని: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో నూతనంగా 1.20 కోట్లతో నిర్మించిన రెండు సచివాలయాలు, హెల్త్ సెంటర్, అంతర్గత సీసీ రోడ్లు, కల్వర్టులకు సోమవారం రాత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు గ్రామాల లోనే అవసరమైన అన్ని సేవలు అందుతున్నాయన్నారు. కులాలకు, మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలు అభివృద్ధి సాధించాలని, సచివాలయ వ్యవస్థ ఏర్పాటును గుర్తించి ఆ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాదని రాష్ట్రంలో మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలను అన్ని మౌలిక సదుపాయాలతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 25 లక్షల రూపాయలతో హెల్త్ కార్డులు మంజూరు చేయడం పట్ల దేశ వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పరిపాలనా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. నాలుగేళ్లలో ఉప్పలపాడు గ్రామంలో 34 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. పొన్నూరు నియోజకవర్గ పరిశీలకుడు అన్నాబత్తుని సదా మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి పనులు వేగవంతంగా ముందుకు తీసుకు వెళుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలందరూ అండగా నిలబడి పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం గ్రామాలకు తాగునీరు పంపిణీ చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ప్రతి పక్షాల అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తిన దయానంద్, సభ్యులు పల్లెంపాటి శ్రీనివాసరావు, చెన్నుపాటి కళ్యాణ్, ట్రస్టుబోర్డు చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సయ్యద్ సుబాని, భీమవరపు కోటిరెడ్డి, స్థానిక నాయకులు దంతాల శ్రీనివాసరావు, ముద్రబోయిన నాగేశ్వరరావు, పందేటి ఏడుకొండలు, పెద్దిపాగ ప్రాన్సిస్, పలువురు అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



గుంటూరు రూరల్: గ్రామీణ యువతీ యువకులకు ఉపాధి లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహించటం జరిగిందని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. సోమవారం లాంఫాంలోని కె.వి.కె.లో కె.వి.కె. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల శిక్షణ తరగతులు ముగిశాయని శిక్షణ తీసుకున్నవారికి సర్టిఫికెట్లను అందజేశామన్నారు. పుట్టగొడుగుల సాగు వ్యవస్థ, బటన్ పుట్ట గొడుగులు, మిల్కీ పుట్టగొడుగులు సాగు, సావన్ ప్రొడక్షన్ టెక్నాలజీ, కేసింగ్, పుట్టగొడుగుల వ్యాధులు, కోత వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గంగాదేవి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పెదనందిపాడు: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన కనపర్తి కేజియా (19) పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన రాజుపాలెం సాంబయ్యకు మూడు సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగామ్ పరిచయం అయ్యారన్నారు. తర్వాత ప్రేమగా మారిందని ఇరువురి పెద్దల సమక్షంలో మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నారని వివరించారు. అయితే కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తుతున్నాయి. వీటికితోడు అత్తమామలు, బంధువులు వేధింపులు ఎక్కువగా ఉండటంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కేజియా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని అనుమానాస్పదస్థితిలో కనిపించిందన్నారు. మృతురాలి తల్లి కనపర్తి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

బీసీల సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొన్నూరు: రాష్ట్రంలో బీసీల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేసిన దుష్ప్రచారాలను ఖండించారు. పట్టణ బీసీ నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెత్తందారీ వ్యవస్థను అమలు చేస్తూ బీసీల గొంతు నొక్కిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం అవకాశం కల్పించారని పేర్కొన్నారు. గీత కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేసిన గొప్పనేత సీఎం జగన్ అన్నారు. పొన్నూరులో ఉనికి కోల్పోయిన టీడీపీ దుష్ప్రచారాలతో ప్రజలకు వెళ్లాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరి శివరామకృష్ణ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి పలగాని రమేష్, పార్టీ బీసీ నాయకులు ప్రగడ బాలాజీ, కందుల సుబ్బారావు, ఎంపీటీసీ నార్నిపాటి నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

నేడు కోయవారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రత్తిపాడు: మండల పరిధిలోని కోయవారిపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ. శ్రీరమ్య తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి వెళ్లి ఆరోగ్య సర్వే పూర్తి చేయడం జరిగిందని, అనారోగ్యంతో ఇబ్బందులు పడే వారిని గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ప్రాథమిక పరీక్షలు జరిపారని, మెరుగైన వైద్యం నిమిత్తం వారంతా నేడు శిబిరానికి హాజరయ్యేలా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు చూస్తారన్నారు. శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు వైద్యసేవలు అందిస్తారని, ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

విజ్ఞాన్ వర్సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధులు


ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధి కౌన్సిలర్ కెంటారో ఒరిటో తదితరులతో చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని న్యూఢిల్లీలో గల ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. జపాన్ ఎంబసీ ప్రతినిధులు కౌన్సిలర్ కెంటారో ఒరిటా, సెకండ్ సెక్రటరీ రైతా సైటో, అడ్మినిస్ట్రేటివ్ అటాచీ రికుతో ఐటోలకు చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణంలు స్వాగతం పలికారు. వైస్‌చాన్స్‌లర్ పి.నాగభూషణం మాట్లాడుతూ గుంటూరు రీజియన్‌లోని విద్యార్థులు నేర్చుకోవడానికి వీలుగా జపనీస్ లాంగ్వేజ్ సెంటర్‌ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని జపాన్ ప్రతినిధులను కోరారు.

స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్, అకడమిక్, పరిశోధన, కన్సల్టెన్సీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్స్‌ను అభివృద్ధి చేసుకోవడానికి అవగాహన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జాయింట్ మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీకు విచ్చేసిన కౌన్సిలర్ కెంటారో ఒరిటా మాట్లాడుతూ రాబోయే కాలంలో ఇండియా-జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త టెక్నాలజీ, ఇండస్ట్రీ, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను రూపొందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జపాన్ దేశంలో యువ ఇంజినీర్లకు లక్షల్లో ఉపాధి అవకాశాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తమ దేశంలో యువ ఇంజినీర్ల కొరత అధికంగా ఉందని, అందుకే తాము యువ ఇంజినీర్లతో పాటు అన్-స్కిల్డ్ లేబర్ కోసం యువత అధికంగా ఉన్న ఇండియా వైపే చూస్తున్నామన్నారు. గుంటూరు రీజియన్‌లోని ప్రజలకు ఉపయోగపడేలా జపనీస్ లాంగ్వేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించారు. జపాన్ ప్రతినిధులు విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీకి అరుదైన పురస్కారం


అవార్డు అందుకున్న అధ్యాపక బృందాన్ని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాల నూతన ఆవిష్కరణలకు ఏఐసీటీఈ నుంచి అరుదైన పురస్కారం లభించడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, భారత ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈల సంయుక్త ఆధ్వర్యంలో కె.ఎల్.యూనివర్సిటీలో జరిగిన ఇన్నోవేటివ్ భారత్ ఐఐసీ రీజినల్ మీట్ 2023లో వందకు పైగా కళాశాలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారన్నారు. వారి పరిశోధనలతో రూపొందించిన వివిధ రకాల నూతన ఆవిష్కరణలను ప్రదర్శన చేశారన్నారు. ఈ ప్రదర్శనలో ఆవిష్కరణల పనితీరు, దానివల్ల కలిగే ప్రయోజనాలు అందుకయ్యే వ్యయాన్ని పరిశీలకులకు ఆవిష్కర్తలు వివరించారన్నారు. ఇందులో తమ కళాశాల బృందం ప్రదర్శించిన నానోఫైబ్రోస్ డ్రెస్సింగ్‌కు ప్రథమ బహుమతి లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వివిధ విభాగాల ప్రతినిధులచే తమ కళాశాల అధ్యాపక బృందం బహుమతి ప్రశంసాపత్రం అందుకోవటం జరిగిందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తమ కళాశాల కీర్తి బావుటా ఎగురవేయటం సంతోషకరమన్నారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన నిపుణుల పర్యవేక్షణలో నిత్యం పరిశోధనలు జలుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బహుమతి అందుకున్న కళాశాల బృందం డాక్టర్ కె.శోభ, డాక్టర్ కార్తీక్ పవన్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ఎస్.రాధిక, డాక్టర్ ఎ.రత్నకుమారి, డాక్టర్ ప్రదీప్‌ల బృందాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

దివ్యాంగులకు బజరంగ్ ట్రైసైకిళ్లు పంపిణీ


గోవింద్‌కు ట్రైసైకిల్ అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా దివ్యాంగ దర్శని కింద కంటెపూడిలోని కొండమూరి గోవిందు, మామిళ్లపల్లిలోని మనబ్రోలు వీరభద్రుడు ఇరువురు దివ్యాంగులకు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ సోమవారం ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ క్రమంలో వారి వద్దే ట్రైసైకిళ్లను పంపిణీ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా కంటెపూడి, మామిళ్లపల్లి గ్రామాల్లో నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని శిబిరాల నిర్వహణతో బజరంగ్ సేవలందించడంపై గ్రామస్తులు అంబటి మురళీకృష్ణను అభినందించారు.

ఘనంగా మంచాలలో ధనుర్మాస పూజలు



మంచాల (చేబ్రోలు): మండల పరిధిలోని మంచాల గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామున తిరుప్పావై, దీపాలంకరణ పూజలు చేశారు. పరాశరం మారుతీ వరప్రసాద్ విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పండుగ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రమణా దేవి

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాడని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని పొత్తూరు గ్రామంలో నూతన పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో గ్రామంలో మొత్తం 65 పింఛన్లు ఉండగా నూతనంగా మరో 16 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పింఛన్లను పంపిణీ చేసి పింఛన్ పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్యామల బ్రహ్మారెడ్డి, సచివాలయం ఉద్యోగులు తదితరులున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



పట్నంబజారు: దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి పోలీసులు కోర్టుకు హాజరుపరిచారు. పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో సోమవారం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.వీరేంద్రబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శుభకార్యం జరుగుతున్న వేళ ఒక బ్యాగులో 129 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీన పట్టాభిపురం పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వీరేంద్రబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఇన్నర్ రింగురోడ్డులోని వెల్‌కమ్ హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేయటంతో పారిపోయేందుకు చూశాడు. వెంటబడి పట్టుకున్న పోలీసులు సదరు వ్యక్తిని గుంటూరు నగరం మల్లిఖార్జునరావుపేటకు చెందిన షేక్ సైదుబాబు అలియాస్ సైదా అలియాస్ బాబుగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా సిద్ధార్థ గార్డెన్స్ కల్యాణమండపంలో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు నుంచి 129 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు విజయ్‌కుమార్, పి.ఏకనాథ్, సిబ్బందిని డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌లు అభినందించారు.

రేపటి గిరి ప్రదర్శనను జయప్రదం చేయాలి

నెహ్రూనగర్: హరిదాసుల (మాల దాసుల) ఆత్మగౌరవార్థం ఈనెల 10వ తేదీన కృష్ణ ధర్మ రక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.దుర్గారావు ఆధ్వర్యంలో జరగనున్న ఇంద్రకీలాద్రి మహాగిరి ప్రదక్షిణను రాష్ట్రంలోని మాలదాసులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం అడవబజార్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 500 మంది అలంకార భూషితులైన మాలదాసుల హరినామ స్మరణ, వందమంది కోలాట కళాకారులు నాట్య ప్రదర్శన చేసుకుంటూ ఈ నెల 10 తేదీ మధ్యాహ్నం 2.45 గంటలకు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేస్తారన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీలలో వివా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వివా ది స్కూల్ బై, గ్రేడ్-3 విద్యార్థి మధుమాల ఆద్య, గ్రేడ్ 9 భీమవరపు లిఖితా రెడ్డి విశాఖపట్నంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వివా, వీవీఐటీ కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ గుంటూరు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో 3 బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందనీ, మధుమాల అద్య వెండి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఉత్తేజాన్ని కలగజేస్తాయనీ, వివా సంస్థ విద్యతో పాటుగా 11 మంది వ్యాయామ ఉపాధ్యాయులతో అన్ని క్రీడలలో శిక్షణ అందిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన అధ్య, లిఖితా రెడ్డిలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్టి కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ సంధానకర్త కె.మాధవి, సీబీఎస్ఈ సంధానకర్త జోతి మెటిల్డా, స్కేటింగ్ కోచ్ కె.కళ్యాణ్ అభినందించారు.

పచ్చపత్రికల్లో వచ్చిన వార్తాకథనాలు అబద్ధాలు

స్పష్టం చేసిన పత్తిపాడు వైఎస్సార్‌సీపీ మాల సామాజికవర్గ నాయకులు


మాట్లాడుతున్న నాయకులు

ప్రత్తిపాడు: పార్టీ అడుగు జాడల్లోనే తామంతా నడవటం జరుగుతుందని, అందులో ఎలాంటి సందేహాలకు తావులేదని వైఎస్సార్ సీపీ మాల సామాజికవర్గ నాయకులు స్పష్టం చేశారు. ప్రత్తిపాడులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, భవిష్యత్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించే విషయాలపై చర్చించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న సమావేశాన్ని వక్రీకరిస్తూ కొన్ని పచ్చ పత్రికలు కథనాలు ప్రచురించడాన్ని ఆ సామాజిక వర్గ నేతలు తీవ్రంగా ఖండించారు. స్థానికంగా వారు మాట్లాడుతూ.. పత్రికల్లో ప్రచురించిన అంశాలన్నీ సత్యదూరమన్నారు. మేమంతా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్న మాట వాస్తవమేనని, అయితే అది సమన్వయకర్తపై చర్చించేందుకో, లేక రాజకీయ లబ్ధికో సమో కాదన్నారు. కేవలం అంబేడ్కర్‌కు నివాళులర్పించే విషయంతో పాటు అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటు విషయంలో మనమంతా ఒకే మాటపై ఐక్యతతో కలిసి ముందుకు వెళ్లాలన్న నిర్ణయాలపై చర్చించుకునేందుకు అని తెలిపారు. సమావేశంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలూ ఎవ్వరూ చేయలేదని తేల్చి చెప్పారు. సమన్వయకర్తకు, పార్టీకి తామెప్పుడూ వ్యతిరేకం కాదని, పార్టీ అధిష్టానం సూచించిన అభ్యర్థికి మేమంతా అండగా నిలుస్తామని, పార్టీ నిర్ణయమే శిరోధార్యమన్నారు. గతంలో పార్టీ విజయానికి పనిచేసినట్లే రానున్న ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తేల్చి చెప్పారు. ఆయా పత్రికల్లో వచ్చిన కథనాలను విశ్వసించ వద్దన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మాల సామాజికవర్గ నేతలు దాసరి చెంచు రామారావు, పిల్లి ఆనంద్, నేలపాటి మైకేల్ రాజు, నేలపాటి అనిల్, మామిడి కోటేశ్వర రావులు పాల్గొన్నారు.